

కౌలు కార్డు ఉన్న ప్రతి రైతుకూ రుణం: కలెక్టర్


విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కౌలు కార్డు కలిగిన ప్రతి రైతుకూ రుణాలు మంజూరు చేయించే లక్ష్యంతో నాలుగు రోజుల పాటు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించామని కలెక్టర్ అంబేడ్కర్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 462 మంది రైతులను రుణాల మంజూరుకు బ్యాంకుల వద్దకు తీసుకువెళ్లగా 126 మంది రైతులకు రూ.50.92 లక్షలు మంజూరు చేశామన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 1379 మంది కౌలు రైతులకు పంట రుణాలుగా రూ.701.47 లక్షలు మంజూరు చేశామన్నారు.



- రోగులను పట్టించుకోని ప్రభుత్వ వైద్యులు
- ప్రైవేటు వైపు చూసేలా సూచనలు
- క్లినిక్‌లు, ల్యాబ్‌లకు తరలింపు
- తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యం కొనుగోలు
- ఆర్థిక భారాన్ని మోస్తున్న పేదలు

అక్కడ మొక్కుబడి.. ఇక్కడ రాబడి





ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా సగటు పౌరుడు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటే ఆలోచిస్తున్నాడు. అక్కడ సరైన వైద్య సేవలు అందుతుయా? నాణ్యమైన మందులు ఉంటాయా? బాధ్యతగా చూస్తారా? అని సందేహిస్తున్నారు. ప్రజలు భయపడుతున్నట్టే కొన్ని ఆస్పత్రుల వైద్యులు వ్యవహరిస్తున్నారు. రోగులను నిర్లక్ష్యంగా చూడడం.. తాము నిర్వహించే క్లినిక్‌లకు రమ్మని చెప్పడం.. ముందులు కూడా ప్రైవేటు ల్యాబ్ లలో కొనుగోలు చేసుకోమనడం.. తదితర ఘటనలు జిల్లాలోని సర్కారు దవాఖానాల్లో సర్వ సాధారణంగా మారాయి. ప్రభుత్వ వైద్యం అందక పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులేమో ప్రైవేటు రాబడికి అలవాటు పడిపోయారు.

- ఎస్.కోట శివారు సీతంపేటకు చెందిన ఓ మహిళకు చేతి మణికట్టు వద్ద భరించరాని నొప్పి వచ్చింది. దీంతో భర్త బుధవారం ఉదయం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో చూపించారు. చేతి మణికట్టును పరిశీలించిన వైద్యుడు నొప్పి నివారించే ఇంజక్షన్‌లు ఇక్కడ లేవని, ఓ ప్రైవేటు మెడికల్ షాపు వద్దకు మధ్యాహ్నం తీసుకురావాలని సూచించారు. అక్కడకు వెళ్లి కొనుగోలు చేశాక మహిళ మణికట్టుకు ఇంజక్షన్ చేశారు. ఫీజు రూ.300, ఇంజక్షన్‌కు రూ.1500, మందు లకు రూ.600 వసూలు చేశారు. వీటితో పాటు పరీక్షలు చేయాలని ల్యాబ్‌కు పంపించారు. అక్కడ రూ.3000 ఖర్చువుతుందని చెప్పడంతో మహిళ భర్త తనకు తెలిసిన మరో లాబ్‌లో రూ.1300 చెల్లించి పరీక్షలు చేయించారు. కాగా డాక్టర్ ఇంజక్షన్ చేశాక మహిళ చేయి వాచిపోయింది. తిరిగి వైద్యునికి చూపించాక జెల్ లాంటిది రాయాలని చెప్పి పంపించేశారు. అయినా తగ్గకపోగా వాపు ఎక్కువవుతుండడడంతో మరో ప్రైవేటు వైద్యుని సంప్రదించారు. అక్కడ మందులు వాడాకే మహిళ ఉపశమనం పొందింది.

- వేపాడ మండలానికి చెందిన యువతి లక్కవరపుకోట మండల పరిధిలోని ఓ గ్రామ సచివాలయంలో ఉద్యోగం చేస్తోంది. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైంది. చేతికి బలమైన గాయమైంది. అత్యవసర చికిత్స కోసం శృంగవరపుకోట ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లగా ఆసుపత్రిలో వైద్యులు కనిపించలేదు. చేసేదిలేక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు.

- శృంగవరపుకోట పట్టణానికి చెందిన ఓ గర్భిణి వైద్య పరీక్షల కోసం ఇటీవల స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లింది. ఆమె మద్రాసులో ఉన్నప్పుడు చేయించిన పరీక్షల రిపోర్టులను వైద్యులకు చూపించింది. వాటిని వైద్యులు పట్టించుకోలేదు. పరీక్షలు కూడా చేయలేదు. దీంతో ఒక్కడ సరైన వైద్యం అందదని భయపడిన ఆమె ప్రైవేటు ఆస్పత్రిని ఆశ్రయించింది.

శృంగవరపుకోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల తీరు కారణంగా ఉచితంగా అందాల్సిన వైద్యాన్ని పేదలు ప్రైవేటుగా కొనుక్కుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులను మానవత్వంతో చూసే పరిస్థితి లేదు. నిర్లక్ష్యంగా మాట్లాడడం.. రోగి పరిస్థితిని పరిపూర్ణంగా పరిశీలించకుండా త్వరగా పంపించే యడం రివాజుగా మారింది. చాలా మంది వైద్యులు ప్రైవేటు ఆసుపత్రుల్లో సొంత క్లినిక్‌లు నడుపుతున్నారు. ఇంకొందరు ఆసుపత్రుల యాజమాన్యాలకు సహకారం అందిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు సక్రమంగా వైద్యం అందించకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుండడంతో పేద, మధ్య తరగతికి చెందిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. చేతిలో డబ్బులు లేని కుటుంబాలు దీనస్థితిలో మరో ప్రభుత్వ ఆసుపత్రికి పరుగులు తీస్తున్నారు. అక్కడైనా (మిగతా 8వ పేజీలో..)

హాయ్.. హాయిగా కొత్త సేవలు!

- వాట్సాప్ వేదికగా 161 పనులు
- వినూత్న పాలనకు ప్రభుత్వం శ్రీకారం

6లో

కవితల మాస్టారు

- తండ్రి స్ఫూర్తితో సాహిత్యం వైపు అడుగులు
- కవిత్వంతో ప్రత్యేక గుర్తింపు



6లో

ఇటు జాతర.. అటు ఎన్నికలు!

- 27న ఎస్.కోటలో వాహనాల పార్కింగ్‌కు సమస్యలు
- తలలు పట్టుకుంటున్న అధికార యంత్రాంగం

6లో



దరఖాస్తులివ్వాలి.. ప్రదక్షిణ చేయాలి!

- నెలల తరబడి పరిష్కారం చూపని అధికారులు
- ముందుకు కదలని అడంగల్ కరక్షన్, క్లాసిఫికేషన్స్ విన్నపాలు



- గుర్ల మండలానికి చెందిన ఓ రైతు అడంగల్ కరక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మండల అధికారులు రికార్డుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను జిల్లా అధికారులకు పంపించారు. జిల్లా కేంద్రానికి ఫైల్ వెళ్లి మూడు నెలలు కావస్తున్నా పరిష్కారం కాలేదు. దీంతో ఆ రైతు నిరాశతో ఉన్నాడు. అనేకసార్లు అధికారులను కలిసి గుర్తుచేసినా ఫలితం లేదు.

- పూసపాటిరేగ మండల పరిధిలో ఓ రైతుకు సంబంధించిన భూమి వివరాల్లో అడంగల్ తప్పుగా నమోదైంది. సరిచేయాలని దరఖాస్తు చేసుకున్నారు. మండల అధికారులు పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారికి రెండు సార్లు ఫైల్‌ను పంపించారు. దాదాపు ఆరు నెలల నుంచి ఈ సమస్య పరిష్కారం కాలేదు. ఆ రైతు కాళ్లు అరిగేలా అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నాడు.



విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులు అడంగల్ కరక్షన్, క్లాసిఫికేషన్ మార్పులు, విస్తీర్ణంలో తేడా తదితర సమస్యలకు పరిష్కారం కోరుతూ దరఖాస్తులు ఇచ్చారు. నెలలుగా అవి అలాగే ఉన్నాయి. మండల స్థాయి అధికారుల నుంచి నివేదిక వెళ్లినా జిల్లా అధికారులు వాటివైపు చూడడం లేదు. రైతుల భూములకు సంబంధించి పేరు తప్పు ఉన్నా? ఆన్‌లైన్‌లో సున్నా చూపించినా? విస్తీర్ణంలో తేడా ఉన్నా? అడ్రస్ సవరించాలన్నా? జిరాయితీ భూమిని ప్రభుత్వ భూమిగా ఆన్‌లైన్‌లో మారినా? మీసేవ లేదా గ్రామ సచివాలయం లేదా నేరుగా రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. వివరాలు సరైనవా.. కావా అన్నది గ్రామ రెవెన్యూ కార్యదర్శి తొలుత నిర్ధారించాలి. అన్నీ సరిపోతే ఆ ఫైల్‌ను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు(ఆర్ఐ) పంపుతారు. ఆర్ఐ పరిశీలించిన తరువాత డిప్యూటీ తహసీల్దార్ సంతకంతో తహసీల్దార్ టేబుల్ పైకి పంపిస్తారు. మండల సర్వేయిర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇచ్చాక తహసీల్దార్ ఆ భూమికి సంబంధించిన ఎండీఆర్, ఎస్ఎఫ్‌సి, ఎఫ్‌సివో వంటి రికార్డులు పరిశీలిస్తారు. అంతా సరిపోతే ఆ ఫైల్‌పై సంతకం పెట్టి కంప్యూటర్ ఆపరేటర్‌కు అందజేస్తారు. ఒక వేళ సక్రమంగా లేకపోతే దరఖాస్తును తిరస్కరిస్తారు. అంతా సక్రమంగా ఉన్న ఫైల్‌ను తహసీల్దార్ లాగిన్ ద్వారా ఆర్‌డీవోకి పంపిస్తారు. అక్కడ పరిశీలన చేసిన తరువాత జిల్లా కేంద్రంలోని కేఆర్ఆర్‌సికి వెళ్తుంది. ఇక్కడ మండల, డివిజన్ స్థాయి నివేదికలు పరిశీలించి జేసికి ఫైల్ పెడతారు. అంతా సక్రమంగా ఉంటే జేసీ ఆమోదిస్తారు. లేదంటే తిరస్కరిస్తారు. కాగా జిల్లా కేంద్రంలోనే ఫైల్స్ ఎక్కువగా పెండింగ్‌లో ఉంటున్నాయి. వందల సంఖ్యలో పేరుకుపోతున్నట్లు సమాచారం.

- ఇదే విషయంపై కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉపకలెక్టర్ మురళి వద్ద ప్రస్తావించగా వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తుల్లో వివరాలు అసంపూర్తిగా ఉంటున్నాయని, వాటిని తిరిగి మండలాలకు పంపి తెప్పించుకోవడంలో కాస్త జాప్యం జరుగుతోందని వెల్లడించారు.

ఫేకర్ తెరుచుకునేదెప్పుడో?

- 14 నెలలుగా లేఆఫ్
- ఆర్థిక ఇబ్బందుల్లో ఫెర్రో కార్మికులు



గరివిడి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): గరివిడిలోని ఫేకర్ పరిశ్రమ కార్మికులు అయోమయంలో ఉన్నారు. పరిశ్రమ త్వరగా తెరుచుకోవాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. యాజమాన్యం నుంచి నేటికీ అనుకూల ప్రకటన రాలేదు. 14 నెలలుగా లేఆఫ్‌లో ఉంది. 2023 నవంబర్ 1వ తేదీన ఫేకర్ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించింది. ఫ్యాక్టరీలో గరివిడి పట్టణంతోపాటు దువ్వాం, దేవాడ, తోండ్రంగి, గుర్ల మండలం చింతపల్లి పేట, సదానందపురం తదితరగ్రామాలకు చెందిన వారు కార్మికులుగా పనిచేస్తున్నారు. పర్మినెంట్, కాంట్రాక్టు, సూపర్‌వైజర్స్ కలిపి దాదాపు 500 మంది పనిచేస్తున్నారు. ఫేకర్ 14 నెలలుగా పనిచేయకపోవడంతో కార్మిక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. ఫ్యాక్టరీపై పరోక్షంగా ఆధారపడే గరివిడి పట్టణంలో వ్యాపారులు.

కిరాణా షాపులు, పాన్‌షాపులు ఆదాయం తగ్గి నిరాశతో నడుస్తున్నాయి. ఫేకర్ తెరిపించేటట్టు చూడాలని రెండు రోజుల క్రితం గరివిడి పట్టణ టీడీపీ నేతలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా ఫేకర్ లేఆఫ్‌పై కార్మిక నాయకులతో యాజమాన్య వర్గాలు వారం రోజుల్లో చర్చలు నిర్వహిస్తాయని సమాచారం. చర్చలు సఫలమై తమకు న్యాయం జరగాలని కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆకట్టుకున్న గుర్రపు పందేలు

వేపాడ, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): నల్లిబిల్లి గ్రామంలో జరుగుతున్న మల్లికార్జునస్వామి తీర్థ మహోత్సవంలో శనివారం గుర్రపు పందేలు అందరినీ ఆకట్టుకున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి అత్యధికంగా హాజరై వీక్షించారు. పాల్గొన్న ప్రతి గుర్రం పోటా పోటీగా పరుగులందుకున్నాయి. విజేతపై చివరి వరకు ఉత్కంఠ కొనసాగింది.



వారి లైసెన్సులను రద్దు చేస్తాం: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని, ఇకపై నిబంధనలు ఉల్లంఘిస్తే వారి లైసెన్స్‌ను రద్దు చేస్తామని కలెక్టర్ అంబేడ్కర్ స్పష్టంచేశారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం ముగింపు కార్యక్రమం కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేగం కన్నా సురక్షితం ముఖ్యమని ప్రతి వాహనదారుడు గుర్తించాలన్నారు. ఉప రవాణా కమిషనర్ మణికుమార్ మాట్లాడుతూ రహదారి భద్రత సామాజిక బాధ్యతగా భావించా లని తెలిపారు. ఈ అంశం పాఠ్య పుస్తకాలలో ఒక పాఠంగా చేర్చితే చాలా ఉపయోగమన్నారు. ఉత్తమ డ్రైవర్లకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.



ఉత్తమ డ్రైవర్ ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

మాదక ద్రవ్యాలతో పట్టుబడితే కఠిన శిక్షలు



ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల కేసుకు సంబంధించి చట్టంలో పొందుపరిచిన విధి విధానాలను పోలీసు అధికారులు పాటించాలని, పట్టుబడిన వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. ఆయా కేసుల దర్యాప్తులో మెలకువలపై జిల్లా పోలీసు కార్యాలయం లోని సమావేశ మందిరంలో శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగం, విక్రయాలకు పాల్పడే వారికి కఠినంగా శిక్ష పడితేనే, ఈ తరహా నేరాలకు అడ్డుకట్ట వేయగలమన్నారు. ఈ కేసుల్లో దర్యాప్తు అధికారులు ఏ చిన్న తప్పుచేసినా నిందితులు శిక్షల నుంచి తప్పించుకొనే అవకాశం ఉందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆయా కేసుల పట్ల అవగా హన కల్పించుకుని, మాదకద్రవ్యాలను కలిగిన వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని చెప్పారు. వర్క్ షాపులో కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ.రంగనాథం, ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు రాఘవులు, భవ్యరెడ్డి, వీరకు మార్, పాడేరు డీఎస్పీ అహ్మద్, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చేప చిక్కింది... పండుగ తెచ్చింది!



పడవను ఒడ్డుకు చేరుస్తూ..



చేపలను పడవ నుంచి బయటకు తీస్తూ...



మత్స్య సంపదను ఇంటికి తీసుకెళుతూ..



సాగరంలో వేటకు వెళుతూ...

సాగరమే వారి ప్రపంచం... సముద్రమే వారికి జీవనాధారం. సాగరంలోని మత్స్య సంపదపై ఆధార పడే మత్స్యకారులు సాధారణంగా వేకువజామునే వేటకు వెళ్లి... మధ్యాహ్నానికి ఇళ్లకు చేరుతుంటారు. వేటాడి తెచ్చిన చేపలను అందరూ సమానంగా పంచుకుంటూ... విక్రయానికి వెళుతుంటారు. కొందరైతే సముద్రంలో చాలా దూరం వేటకు వెళతారు. రాత్రంతా వేట సాగించి... ఉదయాన్నే ఒడ్డుకు చేరుకుంటారు. పూసపాటిరేగ మండలం తిప్పలవలస గ్రామంలోని మత్స్యకారులు శుక్రవారం రాత్రంతా ఇలా వేట సాగించి.. శనివారం ఉదయం ఒడ్డుకు చేరుకున్నారు. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా వలల నిండుగా చేపలు చిక్కడంతో సంతోషంతో ఇంటి బాట పట్టారు.

-విజయనగరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి)

భక్తులతో తోటపల్లి కిటకిట

గరుగుబిల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిన తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీ వేంకటేశ్వర, కోదండ రామస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. నూతన ఆలయాలు నిర్మితం కావడం... పాటు స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉభయ దేవస్థానాల్లో ఆలయ ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు ప్రత్యేక పూజలు చేసి... భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. ఉచిత ప్రసాదాలతో పాటు అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ, సిబ్బంది జి.శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిలో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి



వేంకటేశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు

హాయ్.. హాయిగా కొత్త సేవలు!

- వాట్సాప్ వేదికగా 161 పనులు
- సరికొత్త పాలనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం

కొమరాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి)

వాట్సాప్‌తో ప్రజలకు సులభంగా వివిధ రకాల సేవలు అందించేలా కూటమి ప్రభుత్వం కొత్త ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. 'మన మిత్ర' పేరిట 95523 00009 నంబరుతో 161 పౌర సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏ ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగవలసిన పని లేకుండా మనకు కావలసిన వివిధ పత్రాలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సులువుగా పొందవచ్చు. అంతేకాకుండా తిరుమల తిరుపతి వంటి వివిధ దేవాలయాల దర్శనం టిక్కెట్లు, ఆర్టీసీ టిక్కెట్లు కూడా సులభంగా బుక్ చేసుకోవచ్చు.

పౌర సేవలకు సంబంధించి అన్ని శాఖలలో వెబ్‌సైట్లు, యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇవన్నీ చాలా వరకు ఆంగ్లంలో ఉండడంతో అందరికీ అర్థం కావడం లేదు. దీని వల్ల ఇవి విస్తృత స్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. ప్రస్తుతం కాస్త అక్షర జ్ఞానం ఉన్నవారు కూడా వాట్సాప్ వాడుతున్నారు. 'మన మిత్ర' పేరుతో తెలుగులో వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకురావడం... అన్ని శాఖల సేవలను ఒకే దగ్గర అందించడం వల్ల సేవలు మరింత సులభంగా అందేందుకు అవకాశం దొరికింది. మన మిత్ర వాట్సాప్ తెరిచి ఆంగ్లం లేదా తెలుగులో హాయ్ అని మెసేజ్ చేస్తే చాలు. క్షణాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తుతో కూడిన సందేశం వస్తుంది. అందులో 'సేవలను ఎంచుకోండి' అనే బటన్ నొక్కితే విభాగాల వారీగా అందించే సేవలను చూపిస్తుంది. మనకు కావలసిన ఆప్షన్‌ను ఎంచుకొని సేవలను పొందవచ్చును.

- విద్యార్థులకు పరీక్షల సమయంలో హాల్ టిక్కెట్లు దీని నుంచే పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. రోల్ నంబరు లేదా ఆధార్ నంబర్, పుట్టిన తేదీ నమోదు చేస్తే క్షణాల్లో హాల్ టిక్కెట్ వస్తుంది. ప్రింట్ తీసుకొని నేరుగా పరీక్షా కేంద్రాలకు వెళ్లవచ్చు.
- రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన పుణ్య క్షేత్రాలైన శ్రీశైలం, కాణిపాకం, సింహాచలం, విజయవాడ, అన్నవరం, ద్వారకా తిరుమల, శ్రీకాళహస్తి, తిరుమల తిరుపతి దేవస్థానం తదితర ఆలయాల్లో శీఘ్ర దర్శనాలు, వివిధ రకాల సేవలను వాట్సాప్‌లో బుక్ చేసుకోవచ్చు.
- ఆధార్ సంఖ్య నమోదు చేసి ఎన్టీఆర్ ఆరోగ్య సేవల కార్డులను డౌన్‌లోడ్, నవీకరణ వంటివి పొందవచ్చు.
- రెవెన్యూ శాఖలో వివిధ ధ్రువీకరణ పత్రాలను వాట్సాప్ ద్వారా మన ఇంటి నుంచే పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు భూములకు సంబంధించి 1బిలను నిమిషాల వ్యవధిలో పొందవచ్చు. దీనివల్ల మన సమయం వృధా కాకుండా అనుకున్న సమయానికి పనులు పూర్తి చేసుకోవచ్చు. దీనికి తోడు మనం ఏ ప్రాంతంలో ఉన్నా ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చు.



మన మిత్ర యాప్‌లో ఇలా...

మన మిత్రపై అవగాహన..

వాట్సాప్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించే కార్యక్రమాలను గ్రామ సచివాలయాల ద్వారా చేపడుతున్నట్లు ఎంపీడీవో మల్లికార్జునరావు తెలిపారు.

ఇటు జాతర.. అటు ఎన్నికలు!

- 27న వాహనాల పార్కింగ్‌కు సమస్యలు
- తలలు పట్టుకుంటున్న అధికార యంత్రాంగం



పుణ్యగిరి దేవాలయం

శృంగవరపుకోట ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న శృంగవరపుకోటలోని పుణ్యగిరి జాతర. అదే రోజు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్. జాతరకు లక్షల్లో భక్తులు వస్తారు. గతంలో భక్తులు తమ వాహనాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ఉమ్మడి క్రీడా స్థలంలో పార్కింగ్ చేసేవారు. ఇప్పుడు అదే ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులంతా ఈ కేంద్రంలో ఓటును వినియోగించుకుంటారు. నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాలకు దగ్గరలో జన సంచారం ఉండకూడదు. దీంతో ఈ క్రీడా స్థలంలో పార్కింగ్ చేయడం కుదరదు.

ట్రాఫిక్ ఇక్కట్లు తప్పేదెలా?

అదే ఇప్పుడు అధికార యంత్రాంగాన్ని ఆలోచనలో పడేసింది. స్థానికంగా ఎక్కడా పార్కింగ్‌కు స్థలాలు అందుబాటులో కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తుంది. జాతరకు వచ్చే భక్తుల వాహనాలను పార్కింగ్ చేసేందుకు ఎక్కడ స్థలం కేటాయించాలో అర్థం కాక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరీ ముఖ్యంగా పోలీసు శాఖకు ఇది సవాల్‌గా మారింది. పుణ్యగిరి కొండకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తూనే.. మరో పక్క ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత కల్పించాల్సి ఉంది. ఈ రెండూ ముఖ్యమైనవే కావడంతో ఆ శాఖ అధికారుల్లో టెన్షన్ పట్టుకుంది. ఏటా మహా శివరాత్రి రోజున పుణ్యగిరి కొండకు వచ్చే భక్తులు వాహనాలను నిలిపేందుకు ప్రభుత్వ కళాశాల, ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అనువుగా ఉండేది. ఇక్కడ వాహనాలు పార్క్ చేసి... సమీపంలోని పుణ్యగిరి రోడ్డులో ఆర్టీసీ బస్సులను ఎక్కేవారు. ఈసారి సమీపంలో ఎక్కడా పార్కింగ్‌కు స్థలం లభ్యత లేదు. భక్తులకు పార్కింగ్ స్థలాలు చూపించకుంటే వాహనాలతో పుణ్యగిరికి వెళ్లే అవకాశం ఉంది. అదే జరిగితే అడగడుగునా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పవు. మహా శివరాత్రి పర్వదినం నుంచే ఈ పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది. మరుసటి రోజైతే ట్రాఫిక్‌ను నియంత్రించడం మరీ కష్టమవుతుంది. ఈ జాతరకు వచ్చే భక్తుల సంఖ్య లక్ష వరకు ఉంటుంది. ఈ నెల 26న మహా శివరాత్రి. రాత్రంతా జాగారాలు చేసిన భక్తులు మరుసటి రోజు (27న) తెల్లవారు జాము నుంచి కొండకు వస్తారు. ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొండపై విపరీతమైన రద్దీ ఉంటుంది. ఆ సమయంలో పోలీసులు మెట్ల దారిలో లేకపోతే తోపులాటలు జరిగే అవకాశం ఎక్కువ. చిన్నపిల్లలు, వృద్ధులతో వచ్చేవారికి ఇబ్బందులు తప్పవు.

అక్కడా రక్షణ అవసరం..

శివరాత్రి పర్వదినం రాత్రి నుంచి భక్తులు కొండకు వచ్చి ధార గంగమ్మ, పుట్టధార స్నానఘట్టాల వద్ద స్నానాలు చేస్తారు. ఈ రెండు స్నాన ఘట్టాల వద్ద దొంగతనాలు జరగడం పరిపాటి. వీటన్నిటి నియంత్రణకు పోలీసులు అవసరం. ఇదిలా ఉంచితే... స్థానిక దేవిబొమ్మ కూడలి నుంచి పుణ్యగిరి వరకు ఉన్న రోడ్డు చిన్నది కావడంతో వాహనాలను అనుమతించరు. అక్కడి నుంచి పుణ్యగిరి కొండ వరకు భక్తులను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతిస్తారు. దీంతో పార్కింగ్‌కు స్థలం అత్యంత అవసరం.



గత ఏడాది పుణ్యగిరిలో భక్తుల రద్దీ

ఇలా చేస్తే మేలు..

పుణ్యగిరి కొండకు విజయనగరం జిల్లా కేంద్రం నుంచి జామి, ధర్మవరం మీదుగా వచ్చే భక్తుల వాహనాలను సీతంపేట-ఎస్.కోట మధ్య ఉన్న లేఅవుట్‌కు మళ్లించవచ్చు. అరకు పర్యాటక ప్రాంతం, విజయనగరం వయా తాటిపూడి నుంచి వచ్చే భక్తుల వాహనాల కోసం పందిరప్పన్న కూడలి సమీపంలో ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించవచ్చు. విశాఖపట్టణం నుంచి వచ్చే భక్తుల వాహనాలను పార్కింగ్ చేసేందుకు కొత్తూరు-ఎస్.కోట మధ్య అనువైన స్థలాన్ని కేటాయించినట్లయితే పార్కింగ్ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. భక్తులు వాహనాలను పార్కింగ్ చేస్తున్న ప్రాంతం నుంచి బస్సులను అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. లేదంటే భక్తులు ఇబ్బందులు పడతారు.

కవితల మా'స్టారు'

- తండ్రి స్ఫూర్తితో సాహిత్యం వైపు అడుగులు
- కవిత్వంతో మురళీకృష్ణకు గుర్తింపు



మురళీకృష్ణ



డా.సి.నారాయణరెడ్డి నుంచి బహుమతిని అందుకుంటూ...(ఫైల్)

మెంటాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆయన కవితలు ఆలోచనలు రేకెత్తిస్తాయి. సమాజం గురించి ఆలోచించమంటాయి. ఆయనే మెంటాడ గ్రామానికి చెందిన పాయల మురళీకృష్ణ. బొండపల్లి మండలం రాజకిండాంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. కవితా రచనతో గుర్తింపు పొందుతున్నారు. ఆయనకు మట్టివాసన తెలుసు. తన కలం నుంచి జాలువారే కవితల్లో దాని గుభాళింపు ఉంటుంది. ప్రకృతిని కవితా వస్తువుగా తీసుకొని అలతి అలతి పదాలతో పొందికగా అల్లిన కవితలు రంజింపజేస్తున్నాయి. ఉపాధ్యాయుడైన తండ్రి పాయల సత్యనారాయణ బాలసాహితీవేత్తగా గుర్తింపు పొందారు. ఆయన నుంచి వారసత్వంగా కవిత్వాన్ని అందుకున్న మురళీకృష్ణ ఇటు ఆహ్లాదాన్ని పంచుతాయి...అటు సామాజిక సమస్యలపై ఆలోచింపజేస్తాయి. ఎక్కువగా ఉత్తరాంధ్ర మాండలికంతో ఆయన కవితలు సాగుతాయి. ఆ కవితల్లో ప్రేమికుల విరహ వేదన ఉంటుంది. ఆ కవితల్లో రైతుల ఆవేదన కనిపిస్తుంది. సామాన్యుల గుండె ఘోష వినిపిస్తుంది. ఇలా అనేక అంశాలను ఆయన స్పృశించడం ద్వారా గుర్తింపు పొందుతున్నారు.

ఇవీ పురస్కారాలు..

మురళీకృష్ణ తన కవితలతో రజనీకుందుర్తి పురస్కారం, శిఖామణి కవి సంధ్య పురస్కారం అందుకున్నారు. ఎక్స్‌రే అవార్డు, ఆటా, నాటా, తానా కవితల పోటీల్లో బహుమతులను సొంతం చేసుకున్నారు. ఆటా కవితల పోటీలో 'రెండు మౌన శిఖరాలెదురైనప్పుడు' అనే కవితకు 58 డాలర్ల నగదు బహుమతిని అందుకున్నారు. తానా కవితల పోటీకి పంపించిన 'గచ్చంసెట్టుకటూ ఇటూ' కవితకు 100 అమెరికన్ డాలర్ల నగదు బహుమతిని అందుకున్నారు. దివంగత సి.నారాయణరెడ్డి నుంచి బహుమతి అందుకోవడం మధురానుభూతిగా మురళీకృష్ణ చెబుతారు.

సర్వర్ డౌన్‌తో ఉపాధ్యాయుల అవస్థలు

- ఆన్‌లైన్‌లో హాజరు నమోదుకు పడిగాపులు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా శనివారం మధ్యాహ్నం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం అనంతరం ఆన్‌లైన్‌లో హాజరు వేసుకునేందుకు నెల్లిమర్లలో ఉపాధ్యాయులు అవస్థలు పడ్డారు. స్కూల్ కాంప్లెక్స్ సెషన్ 5 గంటలకే ముగిసినప్పటికి 5.30 గంటల వరకు అటెండెన్స్ వేసుకునేందుకు ఉపాధ్యాయులు వేచి ఉన్నారు. పాఠశాల సమయం 4 గంటలతో ముగుస్తున్నప్పటికీ శనివారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం 5 గంటల వరకు కొనసాగించారని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. ఆన్‌లైన్‌లో హాజరు పడకపోవడంతో చాలా మంది ఉపాధ్యాయులు అక్కడే ఉండి పోవాల్సి వచ్చింది. భవిష్యత్తులో జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు 4 గంటలకు ముగిసేలా షెడ్యూల్ మార్చాలని, అలాగే హాజరు ఆన్‌లైన్‌లో వెంటనే పడేలా సర్వర్‌ను సిద్ధం చేయాలని వారు కోరారు.



నెల్లిమర్లలో ఆన్‌లైన్‌లో హాజరు వేసుకునేందుకు వేచి ఉన్న ఉపాధ్యాయులు

వైభవంగా వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



శ్రీవేంకటేశ్వరుని ఆలయంలో పూజలు

బొబ్బిలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 26వ వార్డు స్వామివారి వీధిలో గల భూసమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో మూడు రోజుల నుంచి పంచమ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధి, కౌన్సిలర్ మరిపి తిరుపతిరావు, సభ్యుల ఆధ్వర్యంలో భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖకు చెందిన వేదపండితులు పెద్దింటి పవన్ కుమార్, ఆలయ అర్చకులు శ్రీహరి నేతృత్వంలో పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం అష్టముఖ గండ భేరుండ లక్ష్మీ నరసింహ హవనం, స్వామివారి కళ్యాణం, విశ్వక్సేనారాధన, ప్రధాన కుంభప్రోక్షణ, సహస్ర దీపాలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు స్వామివారిని దర్శించుకున్నారు.

3వ శనివారం రెండో పూట విద్యార్థులకు సెలవు

- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

గరివిడి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తోంది. ప్రతీనెలా 3వ శనివారం రోజు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం రెండో పూట సెలవు ప్రకటించింది. జిల్లాలో ఈ శనివారం నుంచే అమలులోకి వచ్చింది. మూడో శనివారం ఉపాధ్యాయులకు క్లస్టర్ స్థాయిలో విద్యాబోధనపై అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలోనూ ఈ విధానం ఉండేది. శుక్ర, శనివారాల్లో రెండు భాగాలుగా ఉపాధ్యాయులను విభజించి శిక్షణ ఇచ్చేవారు. ఆ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. ప్రతినెలా మూడో శనివారం విద్యార్థులకు సెలవు ప్రకటించి ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను అమలు చేయనుంది.

రిజిస్ట్రేషన్ నెంబర్లు లేకుండానే..

● నిబంధనలకు విరుద్ధంగా వాహనాల చక్కర్లు ● కొరవడిన పోలీస్, రవాణా అధికారుల పర్యవేక్షణ



నెంబరుకు బదులు ఎమ్మెల్యే తాలుకా అంటూ రాతలు

రాజాం రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయి. పోలీసులతో పాటు రవాణా శాఖ అధికారులు కన్నెత్తి చూడటంలేదు. వాహనాలకు రిజిస్ట్రేషన్ నెంబరు ప్లేట్ ఉంటే ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినా, ప్రమాదాలు జరిగినా, నేరాలకు పాల్పడినా.. పోలీసులు నెంబర్ ప్లేట్ ఆధారంగా సమాచారాన్ని సేకరించే అవకాశం ఉంటుంది. కానీ చాలా వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉండటం లేదు. మరికొన్ని వాహనాలకు రిజిస్ట్రేషన్ నెంబరు స్థానంలో తమ పేర్లు, సినీ హీరోలు, పార్టీల పేర్లు ముద్రిస్తున్నారు. మరి కొంతమంది ఓ అడుగు ముందుకేసి ఫలానా ఎమ్మెల్యే తాలూకా అని రాయిస్తున్నారు. ఇలాంటి వాహనాలపై రవాణా, పోలీస్ అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది. ఇదే విషయాన్ని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ వద్ద ప్రస్తావించగా అలాంటి వాహనాలపై నిఘా పెడతామ న్నారు. ప్రతి వాహనానికి ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ నెంబర్ ఉండాలన్నారు. లేకపోతే కేసు నమోదు చేస్తామని సీఐ స్పష్టం చేశారు.



నెంబరు లేని వాహనం

వల్లూరు ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

నెల్లిమర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరుకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బి.చంద్రకళ సస్పెండ్ అయ్యారు. ఈమేరకు శనివారం డ్వామా పీడీ శారదాదేవి ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో కె.రామకృష్ణరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన 18వ విడత సోషల్ ఆడిట్‌లో ఆమె ఫిర్యాదులు రావడంతో విచారణ అనంతరం పీఈడీ చర్యలు చేపట్టారన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవరలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వ హిస్తున్నట్టు బొడ్డవర వాసవీక్లబ్ అధ్యక్షుడు పచ్చిపులుసు సత్యన్నారాయణ, కార్యదర్శి కలూరి జగన్నాథస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు స్థానిక వినాయక ఆలయ ఆవరణ పరీక్షలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

●రాజాం రూరల్: పట్టణంలోని కంచర వీధిలోని సత్యసాయిబాబా మందిరంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు కానుంది. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ వైద్యులు పరీక్షలు చేపట్టనున్నారని నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు.

పాత విధానంలోనే నిర్వహించండి

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్‌లను పాత విధానంలోనే నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు ఓ ప్రకటనలో కోరారు. ఒక పూట నిర్వహించడం వల్ల అటు విద్యార్థులకు.. ఇటు ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఉపాధ్యాయుల హక్కులకు భంగం కలిగిస్తున్న కొత్త కాంప్లెక్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

వినియోగదారుల కమిషన్ వైస్ చైర్మన్‌గా విశ్వనాథం

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఏపీ వైస్ చైర్మన్‌గా ముచ్చి విశ్వనాథం నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ఆయనకు చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథం ఓ ప్రకటన విడుదల చేశారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తూర్పుకాపులకు గుర్తింపు ఇవ్వండి

రాజాం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుకాపుల గుర్తింపునకు చర్యలు చేపట్టాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌ను తూర్పుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మక్కా సాయిబాబనాయుడు కోరారు. శనివారం కలెక్టరేట్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో తూర్పుకాపులు అధికంగా ఉన్నప్పటికీ సరైన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు



ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న సన్యాసినాయుడు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవిని శనివారం శృంగవరపుకోట జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

వైసీపీది అరాచక పాలన



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అదితి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక పాలనతో రాష్ట్ర అభివృద్ధి గాడి తప్పిందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయనగరం మండల పరిధిలోని పడాలపేట సర్పంచ్ శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యుడు నడిమింటి తులసీ, వైసీపీ నాయకులు సువ్వాడ శ్రీను, నడిమింటి సంతోష్, పడాల ప్రసాద్, పడాల సూర్యనారాయణ, శ్రీనివాస్, పొట్నూరి సత్యనారాయణ, యడ్ల రాము తదితరులు టీడీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరోగమనంలో ఉన్న రాష్ట్రాన్ని చంద్రబాబు ఎనిమిది నెలల వ్యవధిలో ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం చేశారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరేవారు పాతవారితో కలిసి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, ఆల్తి బంగారు బాబు, రాజేష్‌వర్మ, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కారం

విజయనగరం రూరల్: ప్రాధన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయం ఆమె ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



శ్రీనివాసులురెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ జోన్-1 కో-ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి కోరారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున తదితరులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా పార్టీ నాయకులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. అనంతరం జిల్లా పార్టీ నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, షైలిపిల్లి పైడిరాజు, రొంగలి పోతన్న, అవనాపు విజయ్ తదితరులు శ్రీనివాసులురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించండి



మాట్లాడుతున్న సర్వశిక్ష అభియాన్ ఏపీవో

రాజాం రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సర్వశిక్ష అభయాన్ ఏపీఓ గోపీచంద్ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను సర్వశిక్ష అభియాన్ సెంట్రల్ మానిటరింగ్ అధికారి ఆదినారాయణ, అబ్జర్వర్ రమేశ్‌తో కలిసి పర్యవేక్షించారు. సమావేశంలో హెచ్‌ఎం నాగయ్య, స్టాఫ్ సెక్రటరీ అచ్యుతకుమార్‌తో పాటు ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

వేపాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదోతరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించే దుకు కృషి చేయాలని సమగ్రశిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రామారావు అన్నారు. బక్కునాయుడు పేటలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా చదవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రత్యేకాధికారి కిరణ్మయి పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు అభినందనలు

చీపురుపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కరాటే పోటీల్లో ఉత్తమ గ్రేడ్లు సాధించిన చీపురుపల్లి విద్యార్థులను వైసీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అభినందించారు. రాజాం కరాటే అకాడమీ ఫౌండర్ ఆర్.శివ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో చీపురుపల్లిలోని శేఖర్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు సత్తా చాటారు. నజీర్, బాషా, రాహుల్, ప్రశాంత్, నితీశ్, ప్రణీత్, సోమనాథ్ తదితరులు ఉత్తమ గ్రేడ్లు సాధించారు. కార్యక్రమంలో ఇప్పిలి సూర్యప్రకాశ్, ఎల్.ప్రభాత్‌కుమార్, కరాటే మాస్టర్ శేఖర్ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎల్.కోటలోని నివాసంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి స్పందన లభించింది. కొత్తవలస, వేపాడ, ఎల్.కోట, జామి, ఎస్.కోట మండలాల నుంచి వందలాది మంది తమ సమస్యలు తెలియజేసేందుకు తరలివచ్చారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, రోడ్లు, ఎలక్ట్రికల్, ఇళ్లు మంజూరు వంటి సమస్యలపై అధిక సంఖ్యలో వినతులు అందాయి. చిన్న సమస్యలను అక్కడికక్కడే ఎమ్మెల్యే పరిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేబీఏ రాంప్రసాద్, చొక్కాకుల మల్లునాయుడు, జీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

●జామి: శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని జామి ప్రజలు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. ఎల్.కోటలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్‌ను ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు మాకిరెడ్డి శ్రీలక్ష్మి, పసుమర్తి శ్రీనువాసరావు మాట్లాడుతూ జామి మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటు కావడంతో శ్మశానవాటిక అందులో కలిసిపోయిందని వివరించారు. దాంతో ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యేకు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణకు తోడ్పడండి



మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి అన్నారు. స్థానిక కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని ఆమె శనివారం సందర్శించారు. విద్యార్థినిలు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థినిలు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈవో మాణిక్యాలనాయుడు, ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు, సీడీపీవో ప్రసన్న, ఎంఈవోలు మూర్తి, ఈపు విజయ్‌కుమార్, కేజీబీవీ ప్రత్యేక అధికారి బి.ఉమ తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న న్యాయాధికారి శారదాంబ

రాజాం రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసుల రాజీకి ప్రతిఒక్కరూ కృషి చేయాలని న్యాయసేవాధికార సంస్థ మండల అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో పోలీస్, రెవెన్యూ, బ్యాంకింగ్, ఎక్సైజ్ అధికారులు, చిట్‌ఫండ్స్ కంపెనీల ప్రతినిధులు, న్యాయవాదులతో ఆమె సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌లో కేసుల రాజీపై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు, టౌన్ ఎస్ఐ మాతమూర్తి, ఎక్సైజ్ ఎస్ఐ మాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై మామిడి జెల్లీ యంత్రాలు



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖాధికారి జమదగ్ని

లక్కవరపుకోట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మామిడి తాండ్ర తయారు చేసే యంత్రాలను రాయితీపై రైతులకు అందజేయనున్నామని జిల్లా ఉద్యానశాఖ అధికారి జమదగ్ని తెలిపారు. శనివారం భీమాలిలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పది శాతం వాటా చెల్లిస్తే 90 శాతం బ్యాంకుల రుణంగా ఇస్తాయన్నారు. ఏపీ ఎఫ్‌పీఎస్ జనరల్ మేనేజర్ సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ నాణ్యతాప్రమాణాలు పాటిస్తే మార్కెటింగ్‌తో పాటు ఆదాయం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవర అధికారి పద్మ, డీఆర్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో ప్రయోజనాలు

గంట్యాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని డీపీఎం ఆనందరావు అన్నారు. శనివారం మండల సమైఖ్యలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 9 పంచాయతీల్లో ప్రకృతి సాగుకు చర్యలు చేపట్టాలన్నారు. అందుకు ఈనెల 15 నుంచి 20 వరకూ గ్రామస్థాయిలో ప్రణాళికలు తయారు చేసి ఏపీవోకు అందజేయాలన్నారు. ప్రతి ఒక్క మహిళ వారి ఇంటిలో కిచెన్ గార్డెన్, కంపోస్ట్ పిట్స్ తయారు చేసుకునేలా ప్రోత్సాహించాలన్నారు. వెలుగు ఏపీఎం సులోచన రాణి తదితరులు ఉన్నారు.

పెళ్లికి సన్నాహాలు.. ఇంతలోనే విషాదం

● రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

క్రైం న్యూస్



నవీన్‌కుమార్ (ఫైల్)

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పెళ్లి సరదా తీరకుండానే ఆ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. గతేడాది ఇదే సమయంలోనే తండ్రి చనిపోయాడు. తండ్రి ఉద్యోగం ఓ వైపు రావల్సి ఉండగా, మరోవైపు పెళ్లి జరగాల్సి ఉంది. ఈ క్రమంలో ఆ యువకుడ్ని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. వివరాల్లోకి వెళితే.. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం కుడ్డపల్లి గ్రామానికి చెందిన సవర నవీన్‌కుమార్ (21).. తనతో పెళ్లి నిశ్చయమైన ఓ యువతితో కలిసి విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా.. జాతీయ రహదారి కుశాలపురం బైపాస్ జంక్షన్ సమీపంలో శనివారం తెల్లవారుజామున ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొనడంతో నవీన్ అక్కడక్కడే మృతి చెందాడు. విజయవాడలో ఉంటున్న ఆ యువతి విశాఖ వచ్చిందని తెలిసి ఆమెను స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ యువతిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. మృతుడు తండ్రి సవర అనప పోలీసు హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో గతేడాది మార్చిలో మృతిచెందాడు. తండ్రి ఉద్యోగం కారుణ్య నియామకం కింద నవీన్‌కుమార్‌కు ఓ వైపు రావల్సిఉండగా, మరో వైపు నిశ్చితార్థం జరిగిన యువతితో వివాహం జరగాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో నవీన్‌కుమార్ మృతితో ఆ కుటుంబ సభ్యుల రోదన వర్ణణాతీతం. కాగా నవీన్‌కు తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శకు వెళ్లి వస్తూ..

● ఆటో నుంచి జారిపడి మహిళ మృతి

తెర్లాం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట విషాదం చోటు చేసుకున్న నేపథ్యంలో పరామర్శకు వెళ్లి వస్తూ ఆటోలో నుంచి జారిపడి ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన తెర్లాం మండల పరిధిలోని కొరటాం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మెరకముడిదాం మండలం ఉత్తరావల్లి గ్రామానికి చెందిన మర్రి పద్మ (39) మరికొంత మంది మహిళలతో కలిసి బలిజిపేట మండలం గంగాడలో బంధువుల ఇంట్లో ఓ వ్యక్తి మృతి చెందడంతో పరామర్శించేందుకు ఆటోలో శనివారం వెళ్లారు. అక్కడి నుంచి స్వగ్రామం ఉత్తరావల్లి ఆటోలో తిరిగి వస్తుండగా తెర్లాం మండలం కొరటాం వద్ద ఆటో నుంచి పద్మ జారిపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలు పద్మ భర్త దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెర్లాం ఎస్ఐ సాగరబాబు కేసు నమోదు చేశారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బలిజిపేట మండలం సుభద్ర గ్రామ పరిధిలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న పెద్దిరెడ్ల గోపీనాయుడును అదుపులోకి తీసుకుని 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్.సింహాద్రి తెలిపారు.తదుపరి చర్యలు నిమిత్తం సీతానగరం పోలీసులకు అప్పగించినట్టు తెలిపారు. దాడుల్లో హెచ్‌సీలు సుదర్శనకుమార్, రాంబాబు, ఈసీలు రాము, జనార్దనరావు పాల్గొన్నారన్నారు.

కంపోస్టు ఎరువు తయారీపై అవగాహన

నెల్లిమర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): హోమ్ కంపోస్ట్ ఎరువు తయారీపై మహిళలు అవగాహన కల్పించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు అన్నారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కస్తూరిబా గాంధీ విద్యాలయంతో పాటు సువ్వాని వీధిలో తడి చెత్త, పొడి చెత్త వేరుచేయడం, హోమ్ కంపోస్టు తయారీ చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, సచివాలయ కార్యదర్శులు, మెప్మా సీవోలు, ఆర్పీలు ఉన్నారు.

●నెల్లిమర్లలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలె నిర్వహించారు.

రైతులకు యూనిక్ ఐడీ నెంబర్లు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మండల పరిధిలోని ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన యూనిక్ ఐడీ నెంబర్లను కేటాయిస్తున్నారు. మండల పరిధిలోని 23 పంచాయతీల్లో 3,600 మంది రైతులు ఉన్నారు. అందులో 1403 మంది రైతులకు నెంబర్లను కేటాయించారు. మండల వ్యవసాయాధికారి హర్షలత ఆధ్వర్యంలో ప్రక్రియ చురుగ్గా సాగుతోంది.

డిమాండ్ల సాధనకు ర్యాలీ

లక్కవరపుకోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేసి కూటమి ప్రభుత్వ మాట నిలబెట్టుకోవాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఎల్.కోటలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

గజపతినగరం, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాల పెంపునకు శిక్షణ తరగతులు ఎంతో దోహదపడ తాయని జీసీడీవో మాలతి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపునకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సత్యనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై స్పందన

గరివిడి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొండదాడిలో తాగునీటి సమస్యపై టీడీపీ నాయకుడు సాయిరాజు.. ఎంపీడీవో సుబ్రహ్మణ్యంకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. శనివారం గ్రామానికి అధికారులను పంపించారు. ఏయే వీధులలో తాగునీటి సమస్య ఉందో వారు గుర్తించారు. నాలుగైదు రోజుల్లో పూర్తిస్థాయిలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

అలరించిన ఎడ్ల బండ్ల పోటీలు

లక్కవరపుకోట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగరాయపురంలో మరిడిమాంబ తీర్థ మహోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు ప్రజలను అలరించాయి. పది ఎడ్లబండ్ల పోటీలో పాల్గొన్నాయి. విజేతలకు కరెడ్ల ఈశ్వరరావు, గ్రామ పెద్దలు బహుమతులను అందజేశారు.

జిల్లావ్యాప్తంగా స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర



కలెక్టరేట్‌లో చెత్తను తొలగిస్తున్న జేసీ, డీఆర్‌వో, సీపీవో తదితరులు

విజయనగరం కలెక్టరేట్ ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్‌లోని అన్ని శాఖల అధి కారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని వారి కార్యాలయాల ఆవరణలను శుభ్రం చేశారు. చెత్త తరలింపునకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ సేతు మాధవన్ కలెక్టరేట్ ఆవరణంలో అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆయనతో పాటు డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, సీపీవో బాలాజీ, ఏవో దేవీప్రసాద్ ఉన్నారు.

●విజయనగరం రూరల్: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం యూనివర్సిటీ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వీసీ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు పాల్గొన్నారు.

● రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్రను నిర్వహించారు. స్థానిక సివిల్ సప్లయ్ గొడౌన్, రైతుబజార్ ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, గొడౌన్ ఇన్‌చార్జి శ్రీను, ఏపీవో సాయిరాం ఉన్నారు.

●చీపురుపల్లి: పట్టణంలోని పాత పోస్టాఫీస్ వీధిలో శనివారం చెత్తను వేరు చేయడంపై ఎంపీడీవో సురేష్ అవగాహన కల్పించారు. ఆయన వెంట జిల్లా రిసోర్స్ పర్సన్ సుప్రియ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాలరావు, నాసిక రాము తదితరులున్నారు.

●శృంగవరపుకోట: శృంగవరపుకోట పంచాయతీ పరిధిలో శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు ఈవోపీఆర్డీ వి.వి.లక్ష్మి, పంచాయతీ ఈవో అనురాధ అవగాహన కల్పించారు. చెత్త సంపద కేంద్రం వద్ద మొక్కలు నాటారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న రవికుమార్

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయని ఎంపీడీవో పి.రవికు మార్, ఉపాధి హామీ ఏపీవో లక్ష్మీ పతిరాజు తెలిపారు. శనివారం దిబ్బగుడ్డివలస పంచాయతీ లింగంవలసలో ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన ఇంకుడు గుంతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకుడుగుంతల నిర్మాణానికి ఇది సరైన సమయమని, సద్వినియోగం చేసుకొని నీటని పొదుపు చేసి భూగర్భ జలాలు పెంపొందించు కోవాలన్నారు.కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్ ఏర్పాటుపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ శ్యామ్‌సుందర్

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో, ఏడీఏ ఎం.శ్యామ్ సుందర్ ఇంటివద్దే హోం కంపోస్టింగ్, కిచెన్ గార్డెన్, టెర్రస్ గార్డెన్‌లను ఎలా నిర్వహించాలన్న అంశంపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రీయ ఆహారం అవశ్యకతపై వినియోగదారుల్లో పెరుగుతున్న చైతన్యంతో కిచెన్ గార్డెన్ సంస్కృతి విస్తరిస్తోందని తెలిపారు. సోమవారం నుంచి మండలంలోని అన్నిగ్రామాల్లో వెలుగు సిబ్బం ది, క్షేత్రసహాయకులు, గ్రామ వ్యవసాయ సహాయకులతో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని వీటిని అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి, ఉపాధి హామీ పథకం ఏపీవో లక్ష్మీపతిరాజు, ఎంసీవో సుధాకర్, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భూఆధార్‌పై సదస్సు

బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో వీఆర్వోలకు ఫార్మర్ రిజిస్ట్రీ/భూఆధార్, రెవెన్యూ వ్యవస్థ చేయవలసిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతు విధిగా ఈ రిజిస్ట్రేషన్ లేదా భూ ఆధార్ పొందాలని తెలిపారు. ఇంతవరకు మండలంలో 6200 మంది రైతులకు రిజిస్ట్రేషన్‌చేశామని, ఇంకా సుమారు ఏడు వేల మంది వరకు రిజిస్ట్రేషన్ జరగాల్సి ఉందని చెప్పారు.కార్యక్రమంలో హెచ్‌డీటీవో టీకేవీ సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులకు యూనిక్ ఐడీ కార్డులు

రామభద్రపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం యునిక్ ఐడీ కార్డులను జనరేట్ చేస్తోందని, ఈనెల 25వ తేదీలోగా రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.వెంకటయ్య సూచించారు. శనివారం రామభద్రపురం మండల వ్యవసాయ కార్యాలయంలో యూనిక్ ఐడీ కార్డుల కోసం రైతుల నుంచి బయోమెట్రిక్ వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి నుంచి పీఎం కిసాన్, వడ్డీలేని పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి కార్యక్రమాలు రైతులకు అందాలంటే తప్పనిసరిగా వన్‌బీ, ఆధార్ లింకైన ఫోన్ నెంబరుతో బయోమెట్రిక్ వేయించుకోవాలని తెలిపారు.

గురుకులాల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- ఉమ్మడి జిల్లాల గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ రూపవతి



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న రూపవతి

బాడంగి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతంపెంచేందుకు కృషిచేయాలని ఉమ్మడి జిల్లాల గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ రూపవతి తెలిపారు.శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యమని పేర్కొన్నారు. శనివారం బాడంగి గురుకుల పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొవాలని సూచించారు.గురుకులంలో ఉన్న వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి విద్యార్థులకు పరిశుద్ధమైన నీటిని అందజేయాలని ఆదేశించారు. అనంతరం స్వచ్ఛాంధ్రప్రదేశ్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువు కబ్జాను అడ్డుకోవాలి/

- సీపీఎం నాయకుల డిమాండ్



బొబ్బిలి: ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రామభద్రపురం మండలంలోని కొట్టక్కి జాతీయ రహదారి పక్కన చెరువును కబ్జా చేసే పనులు అడ్డుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేత శంకరరావు మాట్లాడుతూ సర్వేనెంబరు 431-5లో గల సుమారు ఎకరా కోనేరును ఆక్రమించుకున్నారని, దీనిని పూడ్చివేసి చదును చేసే పనులు చేపట్టారని తెలిపారు. ఆక్రమణలకు సంబంధించి గతంలో అనేక పోరాటాలు జరిగాయని, తహసీల్దారు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ ఫిర్యాదులు వెళ్లాయని చెపాపరు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసీల్దారు నోటీసు ఇచ్చారని తెలిపారు. ఏడాది గడిచిన తరువాత మళ్లీ చెరువును గ్రావెల్‌తో నింపి రోడ్లు వేస్తున్నారని, ప్లాట్లుగా అమ్ముకునే ఏర్పాటు చేశారన్నారు. పక్కా జాతీయరహదారిని ఆనుకొని ఉన్న చెరువును కబ్జా చేసేస్తుంటే రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలు చోద్యం చూస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బలస శ్రీనివాసరావు, ఎస్.గోపాలం, ఎ.సురేష్, యుగంధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు అరికట్టాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలను రెవెన్యూ అధికారులు అరికట్టాలని బొబ్బిలి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, జిల్లా జనసేన నాయకులు మహంతి ధనంజయరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొట్టక్కి గ్రామ పరిధిలో ప్రభుత్వ స్థలం ఆక్రమణ చేస్తున్నారని పేర్కొని ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆక్రమణలపై గతంలో తాము పోరాలు చేశామని, మళ్లీకొంతమంది ఈ స్థలాలను ఆక్రమిస్తున్నారని తెలిపారు. ఆక్రమణలు నిరోధించకపోతే కోర్టుకు వెళతామని చెప్పారు.

నిర్వహణ లేక.. నిరుపయోగం

- ఇదీ ఎం.పణుకువలసలో ఆర్వో ప్లాంట్ దుస్థితి



ఎం.పణుకువలస పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్ సామగ్రి

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.పణుకువలసలో గతంలో 10 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్వోపాంట్లు నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. గ్రామ ప్రజలకు శుద్ధ జలం అందించేందుకు గతంలో ప్రభుత్వం ఆర్వోపాంట్లు నిర్మించింది. ప్రారంభించిన కొన్నాళ్ల మాత్రమే ప్రజలకు స్వచ్ఛమైన నీరందజేశారు. ఆ తర్వాత ఆర్వో ప్లాంట్ నిర్వహణను పంచాయతీకి అప్పగించారు. తర్వాత నిర్వహణకు నోచుకోకపోవడంతో వినియోగం లేకపోవడంతో మూతపడింది. ఈ నేపథ్యంలో గ్రామస్థులు స్థానిక లభ్యమయ్యే బోరుబావుల నీటినే తాగాల్సివస్తోంది. కాగా ఆర్వో ప్లాంట్ పరికరాలను స్థానిక ఎంపీపీ పాఠశాల వంట గదిలో పెట్టి వదిలేశారు. వంటగది చిన్నది కావడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారుచేయడానికి అవస్థలకు గురవుతున్నామని వంట నిర్వాహకురాలు నల్ల ఈశ్వరమ్మ వాపోయారు. అధికారులు స్పందించి ఆర్వోప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా ఆర్వోప్లాంట్ నిరుపయోగంగా ఉండడం తన దృష్టికి రాలేదని, త్వరలో ఆ గ్రామానికి వెళ్లి చర్యలు తీసుకుంటానని పంచాయతీరాజ్‌శాఖ డీఈఈ డిల్లేశ్వరరావుతెలిపారు.

ప్రహరీ లేదు.. గదులు చాలవు

- కనీస సౌకర్యాలకు నోచుకోని వైనం
- ఇదీ కేశాయివలస పాఠశాల పరిస్థితి



శిథిలావస్థకు చేరిన వంట గది

బొబ్బిలిరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాయివలస ప్రాథమిక పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. కనీస సౌకర్యాలకు నోచుకోలేదు.ప్రధానంగా గదులుచాలకపోవడంతో అవస్థలకు గురవుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో భయాందోళన చెందుతున్నారు.

కేశాయివలస ప్రాథమికపాఠశాలలో 45 మంది చదువుతున్నారు. ఇందులో 15 మంది ఆ గ్రామానికి చెందినవారు, 30 మంది అక్కే నవలస, మోశాయివలసకు చెందిన గిరిజన విద్యార్థులు అభ్యసిస్తు న్నారు. ఇక్కడ హెచ్‌ఎంతోపాటు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. భవనంలో కనీస మౌలిక సదుపాయాలు సౌకర్యాలు సైతం లేవు. పాఠ శాలకు ప్రహరీగోడ లేకపోవడంతో పశువులు, కుక్కలు ఆవరణలోకి వస్తున్నాయని విద్యార్థులువాపోతున్నారు. మరుగుదొడ్లు పాడైనా మరమ్మతులకు నోచుకోవడంలేదు. వంటగది శిథిలావస్థలో ఉండడంతో నిర్వాహకులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలలో సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులుచర్యలు తీసుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అదనపు తరగతి గదులు, వంటగది, పాఠశాల చుట్టూ ప్రహరీ,మరుగుదొడ్డి కోసం ప్రతిపాదనలు పంపించినట్లు హెచ్‌ఎం ధనంజయరావు తెలిపారు. కాగా నాడు-నేడు కింద మంజూరుకాలేదని ఎంఈవో-2 గొట్టాపు వాసుదేవరావు చెప్పారు. పాఠశాలలో సౌకర్యాలులేవని ప్రతిపాదించినట్లు తెలిపారు. మనబడి-మన బాధ్యతలో నిధులు విడుదల కావొచ్చని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- జిల్లావ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం



బొబ్బిలి రూరల్:మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో..



వేపాడ: స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

పరిసరాలు పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వైద్యాధికారులు, వక్తలు తెలిపారు. శనివారం జిల్లావ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ, తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు.

- బొబ్బిలి /రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో పి. రవికుమార్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భాస్కరరావు, ఏఈ రాజశేఖర్, ఏవో అప్పారావు, ఎంసీవో సుధాకర్, ఇంజినీరింగ్ విభాగం, నీటిపారుదల శాఖ, హౌసింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.అలాగే సీహెచ్‌సీలో సిబ్బందికి, వైద్యులకు, రోగులకు అవగాహన కల్పించారు.
- రామభద్రపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తలను ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలని మండల ప్రత్యేకాధికారి జి.ప్రశాంత్ కుమార్ కోరారు. మండలంలోని కొట్టక్కిలో స్వచ్ఛాంధ్ర కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.రత్నం, ఈవోపీఆర్‌డీ వెంకటరమణ, ఏపీవో త్రినాథరావు, కొట్టక్కి పంచాయతీ కార్యదర్శి ఆకుల ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. (ఆంధ్రజ్యోతి బృందం)



బొబ్బిలి: స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పిస్తున్న మునిసిపల్ కమిషనర్ రామలక్ష్మి



రామభద్రపురం:కొట్టక్కిలో చెత్తను ఊడ్చుతున్న అధికారులు

అక్కడ మొక్కుబడి.. ఇక్కడ రాబడి

(ఐదో పేజీ తరువాయి)

వైద్యం అందుతుందన్న భరోసా లేదు. ఇటీవల మెంటాడ మండలానికి చెందిన గర్భిణి చల్లపేట పీహెచ్‌సీకి వెళ్లింది. అక్కడ నుంచి గజపతినగరం ప్రాంతీయ ఆసుపత్రిని ఆశ్రయించగా సాయంత్రం 4గంటలైందని, గర్భిణీని చేర్చుకోలేదు. విజయనగరం ఘోసాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువవడంతో 108 సిబ్బంది ప్రసవం చేయాల్సి వచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా బయటపడ్డారు. అదే ఆపరేషన్ చేయాల్సి వస్తే పరిస్థితి ఏంటన్నది ఆలోచించాల్సిన విషయం. ఇదేమి పట్టించుకోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఎవరికి వారు సమర్థించుకొనేందుకు చూస్తుండడం విచారకరం.

వ్యూహాత్మకంగా రెఫరల్..

ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు వ్యూహాత్మకంగా రోగులను తరలిస్తున్నారు. రాబడే లక్ష్యంగా వ్యాపార దృక్పథాన్ని ప్రదర్శిస్తున్నారు. గర్భిణులతో పాటు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు, ఇతర రోగాల బారిన పడిన వారిని కూడా అత్యవసర వైద్యం అంటూ కేంద్ర ఆసుపత్రులు, కేజీహెచ్‌లకు పంపిస్తున్నారు. అక్కడకు వెళ్లేలోపే రోగం ముదురుతుందని, ప్రాణం మీదకు వస్తుందని భావించిన బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఇదంతా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పలువురు వైద్యుల వ్యూహమన్న ఆరోపణలు ఉన్నాయి. రిఫరల్ సమయంలో మీరు రావాలనుకుంటే ఫలానా ప్రైవేటు ఆసుపత్రులకు రండి అని చెబుతున్నారు. అక్కడ అందుబాటులో ఉంటామని కొందరు, తనకు తెలిసిన మంచి వైద్యులు వున్నారని వారికి రికమండ్ చేస్తానని మరికొందరు సలహా ఇస్తున్నారు. తీరా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిన రోగులకు చుక్కలు చూపిస్తున్నారు. జేబులకు చిల్లులు పెడుతున్నారు. మెడికల్ షాపులో కొనుగోలు చేసిన మందులకు బిల్లులు ఇవ్వడం లేదు. నచ్చినంత తీసుకుంటున్నారు. లాబ్‌ల్లో పరీక్షలకు నిర్దిష్టమైన ధరలు లేవు. వీటి నుంచి వైద్యులకు కమీషన్ అందుతుండడంతో పలువురు వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలను నీరుగార్చుతున్నారు. నియోజకవర్గాల్లోని ప్రజాప్రతి నిధులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న సేవలపై దృష్టిసారించడం లేదు. దీంతో పలువురు వైద్యులు అడిందే ఆట, పాడిందే పాటన్న విధంగా సాగుతోంది.

టెర్రస్ గార్డెనింగ్‌తో ఆహ్లాదకరమైన వాతావరణం

బొబ్బిలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): టెర్రస్ గార్డెనింగ్ ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడడం, స్వచ్ఛమైన గాలి, పండ్లు, పూలు, కూరగాయలు పొందవచ్చని మునిసిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి తెలిపారు. శనివారం బొబ్బిలి మునిసిపాలిటీలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డుల పరిధిలో గల ప్రజలకు తడి చెత్త, పొడిచెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందజేయడం, ఆన్‌సైట్‌కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్‌పై అవగాహన కల్పించారు. అపార్టుమెంట్, గ్రూపు హౌస్‌ల్లో చెత్తలను వినియోగించి ఆన్‌సైట్ కంపోస్టింగ్ పద్ధతిలో ఎరువులను తయారు చేసుకునే విధానంపై, చెత్త నుంచిసంపదను సృష్టిం చడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకో వచ్చని శాస్త్రీయంగా వివరించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు సోమేశ్వరరావు, శానిటరి ఇన్‌స్పెక్టరు మురళి పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

పాలకొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : వేసవిదృష్టిలో ఉంచుకొని ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పాలకొండ సబ్‌జైలు సూపరింటెం డెంట్ బి.జోగులుకు జిల్లా లీగ ల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. శనివారం పాలకొండ సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రయో జనాలు అందిపుచ్చుకోవాలన్నారు. జైలులో వసతులు, ఆహారంపై అడిగి తెలుసుకున్నారు. బెయిల్ కోసం న్యాయవాదిని పెట్టుకోకపోతే ఏర్పాటు చేస్తామన్నారు. కార్య క్రమంలో హెడ్‌వార్డర్ విజయ్‌కుమార్, నాగరాజు, డీపీటీ నాయుడు, లక్ష్మంనాయుడు పాల్గొన్నారు.

నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యో తి): పార్వతీపురంలో వేస విలో నీటి ఎద్దడి లేకుండాచర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు వి. దాలినాయుడు, కోలా కిరణ్, ఎస్.సాయి శ్రీని వాసులు కోరారు.ఈ మేర కు శనివారం మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లకు తాగునీటితో పాటు పారి శుధ్య నిర్వహణ సమ స్యలు పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగు నీటి సరఫరాలో తీవ్రమైన అంతరాయం కలుగుతోందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.పారిశుధ్య నిర్వహణపై కార్మికుల పనిభారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, టిడ్కో గృహల లబ్ధిదారులకు న్యాయంచేయాలని కోరారు.

పెద్దబుడ్డిడి పాఠశాలలో చెట్ల నరికివేత

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పెద్దబుడ్డిడి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రహరీ నిర్మాణం పేరుతో చెట్లు నరికివేయ డంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠ శాలకు 2024-25 ఆర్థిక సంవత్సరా నికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా నాలుగు పార్టులుగా రూ. 39 లక్షలతో ప్రహరీ మంజూరైంది. ఈనేపథ్యంలో ప్రహరీ నిర్మాణానికి అడ్డుగా ఉన్నాయని 63 నీలగిరి చెట్లు అనుమతితీసుకోకుండా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లకుండా నరికి వేయడంపై గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికే దీనికి సంబంధించిన రిపోర్టును వీఆర్వో దూసి తిరుపతిరావు తహసీల్దార్‌కు అందజేశారు. ఈవిష యంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే గ్రామస్థులు తహసీల్దార్ రెడ్డి పకీరుకు, ఎంపీడీవో ఎస్.రమేష్‌కు, ఎంఈవో-2 శ్రీనివాసరావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేశారు. కాగా పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లు అనవసరంగా నరకడం అనేది తప్పేనని, దీనిపై పూర్తి పరిశీలించి చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని పాలకొండ డివిజన్ డిప్యూటీ డీఈవో పి.కృష్ణమూర్తి తెలిపారు.

చెత్త నుంచి సంపద యూనిట్లు ప్రారంభించాలి

భామిని, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో నిర్మించిన చెత్త నుంచి సంపద యూనిట్లు ప్రారంభించాలని ఎంపీడీవో ఎం.సత్యం పంచాయతీ కార్యద ర్శులకు సూచించారు. శనివారం బాలేరు, ఘనసర, కోసలి, సతివాడ తదితర పం చాయతీల్లో యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడైన యూనిట్ల మరమ్మతులకు పంచాయతీ నిధులు వినియోగించాలన్నారు. చెత్త నుంచి తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి వర్మీ కంపోస్టు త్వరితగతిన ఉత్పత్తి చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఈవోఆర్డీ కె.కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మస్తర్లలో తేడాలు ఉంటే చర్యలు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో హాజరైన వేత నదారుల మస్తర్లలో తేడాలు ఉంటే చర్యలు తప్పవని మరుపెంట కా ర్యదర్శి ఎం.భార్గవ నాయుడు హెచ్చరించారు. శనివా రం పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ హాజ రుకాని వారిని మస్తర్లలో నమోదు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేసిన వేతనదారులే పనులకు హాజరుకావాలని కోరారు. ముందస్తు గుర్తించిన ప్రాంతాల్లోనే పనులు నిర్వహించాలని తెలిపారు.

సామర్థ్యాలను పెంచేందుకు దృష్టి సారించాలి

గరుగుబిల్లి,ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వపాఠశాలల్లో విద్యా సామర్థ్యాల ను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని గరుగుబిల్లి సముదాయ చైర్మన్ ఎస్ఎల్ పాత్రుడు సూచించారు. శనివారం గరుగుబిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సముదాయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారులు సూచించిన ఆదేశాలను విధిగా అమలుచేయాలని కోరారు.

డ్రోన్‌తో సారా తయారీ స్థావరాల గుర్తింపు

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండ లంలో చినమేరంగి సర్కిల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ టీవీ తిరుపతిరావు ఆధ్వర్యంలో డ్రోన్‌తో సారా తయారీ స్థావరాలను గుర్తించారు..ఈ సందర్భంగా చినమేరంగి దళితవాడలో సారా తయారీకి వినియోగించే బెల్లపు ఊటలతో ఉన్న ఏడు డ్రమ్ములను గుర్తించి ఊటలను ధ్వంసం చేశారు. అనంతరం ఆ డ్రమ్ములను కాల్చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పి.అనీష్ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

124 సారా ప్యాకెట్లు స్వాధీనం

వీరఘట్టం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌పురం సమీపంలో 124 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి.కళానిధి తెలిపారు. సారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

క్యాన్సర్‌పై సర్వే విజయవంతం చేయాలి

సాలూరు,ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెదపదం పంచాయతీ పరిధిలో బాగువలస పీహెచ్‌సీ పరిధిలో గల వెల్‌నెస్ సెంటర్‌లో జిల్లా నాన్ కమ్యూనికల్ డీజీజెస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌పై జరుగుతన్న సర్వేను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీచేసి క్యాన్సర్‌పై జరుగుతున్న సర్వే నూటికి నూరు శాతం విజయవంతంగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం బోరబండ పరిధిలో జరుగుతున్న క్యాన్సర్ సర్వేను డాక్టర్ రఘు పరిశీలించారు. కార్యక్రమంలోబాగువలస పీహెచ్‌సీ వైద్యాధికారిరవికిరణ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చినమేరంగి ప్రభు త్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు చీఫ్ సూపరింటెండెంట్ జి.శివప్రసాద్ పర్యవేక్షణలో ప్రారంభమయ్యాయి. శనివారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు ఈపరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు. చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు గరుగుబిల్లి మం డలంలోని రావివలసలో కేజీబీవీ నుంచి ఇంటర్ విద్యార్థినులు ఇక్కడ పరీక్షలు రాస్తున్నారు. జనరల్ విభాగానికి చెందిన 20 మంది చొప్పన ఉదయం, మధ్యాహ్నం రాస్తుండగా, ఒకేషనల్‌కు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులు 57 మంది, ద్వితీ య సంవత్సరం విద్యార్థులు 70 మంది పరీక్షలు రాస్తున్నారు.